సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 8 । జనవరి । 2025



పొట్ట కొట్టారు..

అరసవల్లిలో వ్యాపారులు భోరుమంటున్నారు. పండగ ముందు పొట్టకొట్టారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - IIలో



దేహదారుఢ్య పరీక్షలు

కానిస్టేబుల్ ఎంపికల్లో దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. 232 మంది ఎంపికయ్యారు. - IIలో



కొల్లివలస సంతలో పొట్టేళ్ల విక్రయాలు

పొట్టేలు.. వేలకు వేలు

పండగ రోజుల్లో పొట్టేళ్లకు భలే గిరాకీ నెలకొంది. కొల్లివలస సంతలో పొట్టేళ్లు కొనేందుకు మంగళవారం జనం ఎగబడ్డారు. పొట్టేళ్లు, గొర్రెలు, మేకల ధరలు ఆకాశాన్ని అంటాయి. 20 కిలోల గొర్రెపోతు రూ.20వేల వరకు ధర పలుకుతోంది. మేకపోతు ధరలు కూడా దాదాపు అలాగే ఉన్నాయి. నాటుకోళ్ల రేట్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. –బూర్జ

> సంతలో మేకపోతులు మంచి ధర పలుకుతున్నాయి. 20 కిలోల మేక రూ.20వేలపైనే పలుకుతోంది. సంక్రాంతి ముందు వారం కావడంతో పొట్టేళ్లకు గిరాకీ నెలకొంది.
> – బొడ్డ నీలయ్య, చీడివలస గ్రామం, అమ్మకందారు



న్యూస్‌రీల్

435 మద్యం సీసాలు స్వాధీనం



మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

జి.సిగడాం: మండలం బాతువ గ్రామానికి చెందిన కలిశెట్టి పైడిరాజు అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను జి.సిగడాం పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. నడిమివలస కూడలి వద్ద ఏఎస్‌ఐలు కోరుకొండ రామకృష్ణ, పొగిరి శంకరరావులు వా హనాల తనిఖీ చేస్తుండగా జి.సిగడాం నుంచి బాతువ వైపు వెళ్తున్న బైక్‌ను తనిఖీ చేశారు. ఆయన దగ్గర 435 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని పైడిరాజును అదుపులో తీసుకున్నామని ఏఎస్‌ఐలు తెలిపారు.

ఉద్యోగాల తొలగింపుపై నేడు విచారణ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో తొలగించిన 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమను అన్యాయంగా తీసేశారని ఈ నెల రెండో తేదీన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం సంబంధిత పార్టీలకు నోటీసులు జారీ చేశారు. బుధవారం లేబర్ కమిషన్ కార్యాలయానికి హాజరు కావాలని వీసీ రజిని, రిజిస్ట్రార్ సుజాత, ఏజీఎస్ మేనేజ్‌మెంట్ సర్వీస్ (గుంటూరు జిల్లా తాడేపల్లి)కి చెందిన కంట్రోలర్ రూపేష్‌బాబులకు నోటీసులు జారీ చేశారు. గతంలో సైతం వేతనాలు అందజేయలేదని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు లేబర్ కమిషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేయటంతో వేతనాలు చెల్లించారు. మూడేళ్ల పాటు ఏజెన్సీ కాంట్రాక్ట్ ఉందని, ఈ నిబంధనలు పాటించకుండా గత నెల 31న తొలగించారని, ఏడాది పనికి 11 నెలలు మాత్రమే వేతనాలు చెల్లించారని, ఈ నెల 1వ తేదీ నుంచి విధులకు హాజరు కాకుండా అడ్డుకుంటున్నారని, ఎలాంటి ముందస్తు నోటీస్ లేకుండా కక్షతో తొలగించారని తెలిపారు. ఈ మేరకు అధికారులు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. హాజరు కాకుంటే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని నోటీస్‌లో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ పేర్కొన్నారు.

డిసెంబర్ నెల వేతనం చెల్లింపు

వర్సిటీ అధికారులు డిసెంబర్ నెల ఔట్ సోర్సింగ్ 34 మంది ఉద్యోగులకు మంగళవారం వేతనాలు చెల్లించారు. వర్సిటీ అధికారులు ఏజీఎస్ మేనేజ్ మెంట్ సర్వీసెస్‌కు చెల్లించగా, వారు ఉద్యోగుల ఖాతాల్లో నిబంధనలు మేరకు జమ చేశారు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ రద్దు చేసినట్లు వర్సిటీ అధికారులు గతంలో ప్రకటించారు. రద్దు చేసిన ఏజెన్సీ నుంచి వేతనం చెల్లించటం గమనార్హం.

రెండు జిల్లాల సరిహద్దు భూముల పరిశీలిన



భూములను పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు

జి.సిగడాం: జి.సిగడాం మండలం గొబ్బూరు గ్రామం, విజయనగరం జిల్లా రాజాం మండలం పొగిరి పంచాయతీ బొడ్డవలస గ్రామాల సరిహద్దులో ఉన్న భూములను మంగళవారం శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ సర్వే పరిశీలకులు అనుపోజు వెంకటేశ్వరరావు, మండల సర్వేయర్ శాంతారావు మొయ్యి ఈశ్వరరావు, ఆర్ఐ రాధ, వీఆర్ఓ లక్ష్మణరావు కలిసి పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కారం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. రీ సర్వే చేసిన గ్రామాల్లో ఎక్కడైనా తప్పులు ఉంటే వాటి పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మహదాస్యం చిన్నారావు, కార్యదర్శి ధర్మవరపు సతీష్ లతోపాటు సిబ్బంది ఉన్నారు.

మరో ఐదు రోజులు గడువు పొడిగింపు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : ఎస్సీ కుల గణనపై అభ్యంతరాల స్వీకరణ గడువును ఈ నెల 12వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబరు 31తోనే గడువు పూర్తయినా ఈనెల 7 వరకు ఒకమారు పొడిగించారని, మళ్లీ ఇప్పుడు రెండోసారి ఐదురోజులు పొడిగించినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని అన్నారు.

అన్నింటా ఆదర్శప్రాయం..

ఫలితాలే నిదర్శనం



పేరులోనే కాదు తీరులోనూ ఆ బడి ఆదర్శవంతంగా నిలుస్తోంది. పుస్తకాల బరువులతో పిల్లలు కుంగిపోకుండా గురువులు సృజనాత్మక విషయాలు బోధిస్తున్నారు. కేవలం ర్యాంకుల వెంబడి పరిగెత్తకుండా చదువుకు సరదాను జోడిస్తున్నారు. విద్యుత్ పొదుపుపై గురువులు, పిల్లలు కలిపి ఏకంగా షార్ట్ ఫిల్మ్ తీసి స్టేట్ ఫస్ట్ ప్రైజ్ కొట్టారు. ఏటా అత్యుత్తమ ఉత్తీర్ణత సాధిస్తూ ముందుకెళ్తున్నారు.



జి.సిగడాం మోడల్ పాఠశాల ఇదే

- రాష్ట్రస్థాయిలో నంబర్ వన్‌గా జి.సిగడాం మోడల్ స్కూల్
- పది, ఇంటర్ ఫలితాల్లో చక్కటి ప్రతిభ
- క్రమశిక్షణకు మారుపేరుగా ఖ్యాతి

జి.సిగడాం:

అందుబాటులో మౌలిక సదుపాయాలు, ఆహ్లాదకరమైన వాతావరణం, అద్భుతమైన బోధన కలగలిపి జి.సిగడాం మోడల్ పాఠశాల. వరుసగా చక్కటి విజయాలు సాధిస్తూ రాష్ట్రంలోనే నంబర్‌వన్ పాఠశాలగా కీర్తినందుకుంటోంది. ఇక్కడ 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు 700 మంది చదువుతున్నారు. ఇక్కడ ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆటపాటలతో మెరుగైన విద్యను బోధిస్తున్నారు. దీంతో చక్కటి ఫలితాలు సాధ్యమవుతున్నాయి. ఇంటర్ విద్యార్థులకు ఆధునిక ల్యాబ్‌లు ఉన్నాయి. పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రవ్యాప్తంగా 75–99 శాతం ఉత్తీర్ణత సాధించిన ఐదు పాఠశాలల్లో ఇది కూడా ఒకటి. ఇటీవల రాష్ట్రస్థాయిలో 200 విద్యాలయాలు, కార్పొరేట్ విద్యాలయాలు కలిసి విద్యుత్ వినియోగంపై లఘు చిత్రాల పోటీ నిర్వహించాయి. ఈ పోటీలో మోడల్ స్కూల్ విద్యార్థులు తీసిన పవర్ ప్రేమికుడు మొదటి బహుమతి కైవసం చేసుకుంది. ఇటీవల విజయవాడలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్, ఎండీ ఏపీ జెన్‌కో కేవీఎస్ చక్రధర్‌బాబు చేతుల మీదుగా తెలుగు అధ్యాపకులు కోట తిరుపతిరావు, విద్యార్థులు వి.వైకుంఠరావు, డోల వరప్రసాదరావు, ఎ.ఈశ్వర్, ఆర్.తేజ నగదు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. రాష్ట్ర ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) నిర్వహించిన ఈ పోటీల్లో పవర్ ప్రేమికుడు అందరినీ ఆకట్టుకుంది.



ఇటీవల రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతిని అందుకుంటున్న పాఠశాల విద్యార్థులు

బాలికలకు వృత్తి విద్యాకోర్సు

వృత్తి విద్యా కోర్సుల్లో బాలికలు రాణించాలనే ఉద్దేశంతో మోడల్ స్కూళ్లలో వృత్తి విద్యా కోర్సులు ప్రవేశపెట్టారు. ఈ కోర్సులను జి.సిగడాం మోడల్ స్కూల్ విద్యార్థులు చక్కగా ఉపయోగించుకుంటున్నారు. ఈ ఏడాది 80 మంది విద్యార్థులకు వివిధ రకాల కోర్సులపై ప్రయోగాలు నిర్వహించారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రతినిధులు మంజు శర్మ, అనిత సింగ్ వచ్చి పరిశీలిచారు.

ఉపాధ్యాయుల కృషితోనే..



మేము విద్యతోపాటు చిన్న చిన్న లఘుచిత్రాలను తీసేందుకు మా ఉపాధ్యాయులు సహకరించారు. వారి కృషితో పవర్ ప్రేమికుడు లఘు చిత్రం షార్ట్ ఫిల్మ్ తీశాం. రాష్ట్రస్థాయిలో మేము గెలవడం ఎంతో ఆనందంగా ఉంది. – డోల వరప్రసాదరావు, 10వ తరగతి విద్యార్థి మోడల్ పాఠశాల, జి.సిగడాం

క్రమశిక్షణతో కూడిన విద్య



విద్యాలయంలో చదువుతున్న ప్రతి విద్యార్థికి క్రమశిక్షణతో కూడిన విద్య అందిస్తున్నాం. తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై బాధ్యత తీసుకోవాలి. రాష్ట్రస్థాయిలో విద్యుత్ పొదుపుపై తీసిన చిత్రం నంబర్‌వన్ స్థానం కైవసం చేసుకోవడంతో ఎంతో ఆనందంగా ఉంది.
– కోట తిరుపతిరావు, తెలుగు అధ్యాపకుడు, మోడల్ పాఠశాల, జి.సిగడాం

అందరి సహకారంతోనే



విద్యాలయంలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది, సహకారంతోనే పవర్ ప్రేమికుడు లఘు చిత్రం తీశాం. విద్యుత్ వినియోగం ఎలా ఉండాలో వివరించాం. దానికి స్టేట్ ఫస్ట్ ప్రైజ్ వచ్చింది. పోటీ పరీక్షల్లో కూడా విద్యార్థులు మంచి ప్రతిభ కనబరుస్తున్నారు. ఏటా ఎన్ఎంఎంఎస్‌లో మంచి ఫలితాలు సాధిస్తున్నాం.
– డాక్టర్ అన్నా శామ్యూల్ లంక, ప్రిన్సిపాల్, ఏపీ మోడల్ పాఠశాల జి.సిగడాం

అర్ధరాత్రి.. కోర్టులోకి దూరి



శ్రీకాకుళం క్రైమ్ : దొంగలు రెచ్చిపోతున్నారు. కోర్టు అన్న భయం కూడా లేకుండా ఏకంగా బార్ అసోసియేషన్ భవనంలోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. రాత్రి పూట జనాల అలికిడి ఉండే ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఈ దొంగతనం జరగడం గమనార్హం. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్సు ఎదురుగా ఉన్న న్యాయస్థానం ఆవరణలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. న్యాయస్థానం ఆవరణలో ఉన్న బార్ అసోసియేషన్ భవనంలో అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి టీవీ దొంగిలించారు. అక్కడితో ఆగకుండా పక్కనే ఉన్న టీస్టాల్ కౌంటర్‌లో రూ. 3 వేల నగదును సైతం కాజేశారు. మంగళవారం ఉదయం సమాచారం అందుకున్న పోలీసులు, క్లూస్ టీమ్ చేరి వేలిముద్రలు సేకరించామని, జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

డేంజర్ బెల్స్

పొందూరులో పెరుగుతున్న డయేరియా కేసులు

- పరిశుభ్రత లోపమే కారణమంటున్న అధికారులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

పొందూరు: పొందూరులో డయేరియా డేంజర్ బెల్స్ మోగిస్తోంది. స్థానిక కస్పావీధి దానికి ఆను కుని ఉన్న ప్రాంతాల్లో డయేరియా రోగులు రోజు రోజుకూ పెరుగుతున్నారు. మంగళవారం మరో ఐదుగురు రోగులకు వ్యాధి సోకడంతో పొందూరు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో చేరారు. వారిలో అనకాపల్లి రాము(48)కు వాంతులు, విరేచనాలు, ఆయాసం ఎక్కువగా ఉండటంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మరొకరికి తగ్గుముఖం పట్టడంతో ఇంటికి చేరుకున్నారు. మరో ముగ్గురు ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు. వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డయేరి యా వ్యాపించిన వీధుల్లో బోరు బావులు, నూతులవద్ద తాగునీటి సరఫరాను నిలిపివేసి ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. తాడివలస పీహెచ్‌సీ వైద్యులు రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో పీహెచ్‌సీ సిబ్బది రోగులకు ఇంటి వద్ద చికిత్స అందిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను ఎంపీడీఓ మన్మథరావు పరామర్శించారు.

బాధితులకు పరామర్శ

డయేరియా సోకిన రోగులను, కుటుంబాలను జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య మంగళవారం పరామర్శించారు. వీధుల్లో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. తాగునీటి వనరుల్లో ఎలాంటి కలుషితం లేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజు డీపీఓకు తెలిపారు. ల్యాబ్‌లలో నిర్వహించిన నీటి పరీక్షల రిపోర్టులను డీపీఓకు అందించారు. దీంతో వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రత లేకపోవడమే వ్యాధి తీవ్రతకు కారణమని డీపీఓ గుర్తించారు. నాలుగు రోజుల పాటు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించాలని ఈఓ మోహన్ బాబును ఆదేశించారు. వీధులలో తిరిగి పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వ్యాధి తీవ్రతపై వైద్యులతో మాట్లాడారు. వ్యాధి వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆరోగ్య, పంచాయతీ అధికారులతో చర్చించారు.

మాంసం, చేపల విక్రయాలపై నిషేధం

పొందూరులో సోమవారానికి 15 మంది డయేరియా రోగులు ఉండగా, మంగళవారానికి మరో ఐదుగురు పెరిగారు. వ్యాధి తగ్గుముఖం పట్టకపోవడంతో పంచాయతీ అధికారులు పొందూరులో చేపలు, మాంసం విక్రయాలపై నిషేధం విధించారు. నాలుగు రోజుల పాటు విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు అమలులో ఉన్నాయని చెప్పారు. ఆ మేరకు పంచాయితీ ఈఓకు ఆదేశించారు. వ్యాధి పూర్తిగా అదుపులోకి వచ్చేంత వరకు వైద్య శిబిరాలు కొనసాగించాలని సూచించారు. ఆమెతో పాటు డీఎల్‌పీవో ఐవీ రమణ, ఎంపీడీఓ మన్మథరావు, ఏఓ మిశ్రా, సర్పంచ్ ఆర్, లక్ష్మి తదితరులు ఉన్నారు.



కస్పావీధిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

అవిసిపోయింది ప్రాణం



గేదెల అప్పారావు

కాశీబుగ్గ: నిరుపేద కుటుంబం.. యజమానికి కిడ్నీ వ్యాధి.. అర్ధాయువులోనే చావు. ఉద్దానంలో దశాబ్దాలుగా ఈ కథ కొనసాగుతోంది. తాజాగా పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన గేదెల అప్పారావు(58) అనే వ్యక్తి కిడ్నీ వ్యాధితో పోరాడుతూ మంగళవారం ఉదయం మరణించారు. అప్పారావుకు చాలా ఏళ్లుగా కి డ్నీ సమస్య వేధిస్తోంది. ఆయనకు ఇద్దరు కు మార్తెలు ఉండడంతో ఎలాగైనా వారికి వివా హం చేసి ఓ ఆధారం చూపించాలని ఆయన తపనపడ్డారు. చిన్న కుమార్తె పెళ్లి అయ్యాక.. ఆయన కన్నుమూశారు. నెల రోజుల కిందటే ఈ వివాహం జరిగింది. వారానికి రెండుసార్లు ఆయన డయాలసిస్ చేయించుకునేవారు. బొడ్డపాడు యువజన సంఘంలో అధ్యక్షులుగా, కార్యదర్శిగా పనిచేశారు. మంచి కళాకారుడు కూడా. వారం కిందటే ఉద్దానం రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆయనకు 'కామ్రేడ్ తాతారావు స్మారక పురస్కారం' అందజేశారు. ఆయన మృతితో స్థానికంగా విషాద ఛాయలు అలముకున్నాయి.



ఆకట్టుకున్న రంగవల్లులు

రంగోత్సవం



జానపద నృత్య పోటీల్లో విద్యార్థినుల బృందం


శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో రంగోత్సవాలు ఉత్సాహంగా సాగాయి. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల వేదికగా మంగళవారం జరిగిన ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి వివిధ యాజమాన్య పాఠశాలలు, కళాశాలల నుంచి 6 నుంచి ఇంటర్ వరకు చదువుతున్న 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. క్విజ్, చిత్రలేఖనం, చేతిరాత, సంప్రదాయ జానపద నృత్యం, డిజిటల్ పోస్టర్ తయారీ, నినాదాల తయారీ, రోల్‌ప్లే తదితర అంశాలలో పోటీలు జరిగాయి. కార్యక్రమంలో డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, డీవైఈఓ ఆర్.విజయకుమారి, ఎ.గౌరీశంకర్, సీనియర్ అధ్యాపకులు ఎం.భారతమ్మ, జీవీ రమణ, ఎ.వేణుగోపాల్, లీలామోహన్, వైవీపీ నాయుడు, కె.అప్పన్న పాల్గొన్నారు.

పడతుల గళమున..

- గోదా గోష్టి పేరుతో శ్రీకూర్మంలో మహిళల నగర సంకీర్తన
- కూర్మనాథ స్వామి తిరువీధి మార్గంలో నిర్వహణ



శ్రీకూర్మంలో గోదాగోష్టి (మేలుకొలుపు) నిర్వహించేందుకు వెళ్తున్న మహిళలు



గార: ఆదికూర్మ క్షేత్రంలో ఆడపడుచుల గళములు స్వామికి స్వరార్చన చేస్తున్నాయి. ధనుర్మాసంలో మహిళలంతా ప్రతి రోజూ వేకువజామున నిర్వహించే మేలుకొలుపునకు 39 ఏళ్లు పూర్తయ్యాయి. గోదాగోష్టి పేరుతో మహిళలే ఈ క్రతువు నిర్వహిస్తున్నారు. తమిళనాడు రాష్ట్రం శ్రీవిల్లి పుత్తూరులో గోదాదేవి శ్రీకృష్ణున్ని ప్రసన్నం చేసుకునేందుకు మేలుకొలుపు జరిపి, గోపికలను సమాయత్తం చేసినట్లు పురాణాల మాట. ఆ మాదిరిగానే శ్రీవైష్ణవ సంప్రదాయ పరంపరగా ఉన్న శ్రీకూర్మనాథ క్షేత్రంలో సరిగ్గా 39 ఏళ్ల కిందట తిరువెంగళమ్మ (గురువమ్మ), దేవాలయం అప్పటి స్థానాచార్య లు శ్రీభాష్యం రామప్పలాచార్యులు సతీమణి అనంత లక్ష్మమ్మలు వీటిని ప్రారంభించారు. తొలుత నలుగురు, ఐదుగురుతో మొదలైన ఈ కార్యక్రమంలో ఇప్పుడు యాభై మందికిపైగా పాలు పంచుకుంటున్నారు. గురువమ్మ కుమార్తె లక్ష్మమ్మ కొన్నాళ్ల ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, వైష్ణవ పరంపరంలో భాగంగా ఇప్పటి అధ్యాపకులు టీపీ శ్రీనివాసాచార్యులు సతీమణి సుశీలరాణి శ్రీకృష్ణుని చిత్రపటంతో నడువగా, ప్రతి ఇంటి వద్ద హారతులిస్తూ మేలుకొలుపు జరుగుతోంది. భక్తులిచ్చే నైవేద్యాలతో ఆలయంలోకి చేరుకొని స్వామికి హారతిస్తారు. ఆలయంలో ధనుర్మాసోత్సవంలో భాగంగా జరిగే గోదాదేవి, చక్రపెరుమాళ్ జరిగే బేడాసేవలో పాల్గొంటారు. మేలుకొలుపు ద్వారా వచ్చిన డబ్బులను ఆలయంలో జరిగే గోదా రంగనాథుల కల్యాణోత్సవాన తాళి బొట్టు, నూతన వస్త్రాలు, ప్రసాదానికి వినియోగిస్తారు.



కూర్మనాథాలయంలోని బేడా సేవ

సంకల్ప బలమే..



సంకల్ప బలం ద్వారానే ఇంత బాగా జరుగుతోంది. గోదా దేవి చేసిన మాదిరిగానే నిడువ బొట్టు పెట్టుకొని ఈ వ్రతంలో పాల్గొంటున్నాను. వేకువజామున కచ్చితంగా ఐదు గంటలకే ప్రారంభించే కార్యక్రమంలో పాల్గొని చివరి వరకు ఉంటాను.
– సింహాద్రి మీనాక్షి, శ్రీకూర్మం

వర్షాలు పడినా ఆపలేదు



ఒక్కో ఏడాది భారీ వర్షాలు పడినా గోదాగోష్టి ఆపలేదు. గాలులు వీచినా, మంచు కురుస్తున్నా ఈ వ్రతంలో పాల్గొంటున్నాం. ప్రతి ఇంటి నుంచి పెద్ద పండితులు కూడా వచ్చి శ్రీకృష్ణునికి హారతులిచ్చి, ప్రసాదాలు సమర్పిస్తారు.
– కస్పా సరస్వతి, శ్రీకూర్మం

క్లుప్తంగా

విద్యుత్ రిటైల్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్ఈ కృష్ణమూర్తి తదితరులు

అరసవల్లి: 2025–26 వార్షిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మంగళవారం బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. హైబ్రిడ్ విధానంలో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, టెక్నికల్ ఈఈ సురేష్‌కుమార్, అకౌంట్స్ అధికారి లీలామోహనమురళి తదితరులు పాల్గొన్నారు. వినియోగదారుల నుంచి వచ్చిన సూచనలు, సలహాలను విద్యుత్ నియంత్రణ మండలి దృష్టికి తీసుకెళ్తామని ఎస్ఈ ప్రకటించారు. ఈ నెల 8, 10 తేదీల్లో శ్రీకాకుళం, పలాస, టెక్కలి డివిజనల్ కేంద్రాల్లో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తామని తెలిపారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ ఆవరణలో నిర్వహిస్తున్న యూనియన్ బ్యాంకు స్వయం ఉపాధి శిక్షణ కోర్సుల్లో ఉచిత శిక్షణకు మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శిక్షణ సంస్థ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి నెల రోజుల పాటు మగ్గం వర్కు, బ్యూటీ పార్లర్ నిర్వహణ, కంప్యూటర్ అకౌంటెన్సీ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 19 నుంచి 45 ఏళ్ల మధ్య మహిళలు అర్హులని, పూర్తి వివరాలకు 9553410809, 7993340407 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పండుగ ముందు.. పొట్ట కొట్టారు!



దుకాణాలను తొలగిస్తున్న దృశ్యం



దుకాణం వద్ద దిగాలుగా కూర్చున్న వడ్డి లక్ష్మి

- అరసవల్లి ఆలయం ముందు షాపుల కూల్చివేత
- అన్నప్రసాదాల తయారీ, కౌంటర్లు సైతం నేలమట్టం.
- తక్షణమే ఖాళీ చేయించాలన్న ఆదేశాలపై స్థానికుల మండిపాటు

అరసవల్లి: దశాబ్దాల నుంచి ఆదిత్యుని సన్నిధిలోనే చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనాన్ని గడుపుతున్న ఆ పది మందిపై కూటమి ప్రభుత్వం గట్టి దెబ్బే కొట్టింది. అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం ముందు ఉన్న ఆదిత్య షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న 10 దుకాణాలను కూల్చివేయాలని మంత్రి అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌లు నిర్ణయించి.. కలెక్టర్, ఆలయ ఈవోలకు ఆదేశించడంతో కూల్చివేత పనులు యుద్ధ ప్రాతిపదికన ప్రారంభమయ్యాయి. దీంతో బాధితులంతా రోడ్డున పడ్డారు. మరికొద్ది రోజుల్లో పెద్ద పండుగ వస్తున్న నేపథ్యంలో వారంతా దుకాణాల్లో వేలాది రూపాయలు అప్పులు చేసి మరీ అదనంగా సరుకులతో దుకాణాలు నింపిన క్రమంలో మంగళవారం ఉదయం దుకాణాలు ఖాళీ చేయించేశారు. ప్రసాదాల తయారీ భవనం, అన్న ప్రసాద భవనాలను కూడా కూల్చేసేందుకు సిద్ధం కావడంతో అన్నప్రసాదాన్ని వైజయంతి మండప షెడ్డులో భక్తులకు బఫే విధానంలో వడ్డించారు.

ఇదేం పద్ధతంటూ భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అన్నదాన మండపానికి, ప్రసాదాల తయారి భవనానికి పలువురు దాతలు విరాళాలిచ్చి అభివృద్ధి చేశారు. ఈ భవనాల కూల్చివేత సమయంలో కనీసం ఆయా దాతలకు గాని కుటుంబసభ్యులకు గాని ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

రోడ్డున పడ్డాం..



మా కుటుంబం మొత్తం కలిసి ఇక్కడే వ్యాపారాలు చేస్తున్నాం. ఉన్నట్టుండి షాపు ఖాళీ చేయించారు. ఇది అన్యాయం. పండుగ ముందు మా పొట్టకొట్టారు. కుటుంబమంతా రోడ్డున పడ్డాం. మా ఉసురు తగులుతుంది. ఈమధ్యే డబ్బులు కట్టించుకుని ఇలా అన్యాయం చేయడం తగదు.

– సుజాత, బాధితురాలు

సప్తమి అని చెప్పి..

ఆలయ అభివృద్ధి పనుల పేరిట ఐదు రోజుల క్రితమే పురాతన టీటీడీ సత్రం కూల్చివేతకు శ్రీకారం చుట్టిన ఆలయ అధికారులు.. స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆదిత్య షాపింగ్ కాంప్లెక్స్‌ను కూల్చివేయాలని నిర్ణయించారు. 2002 నుంచి స్థానికులు పైడిపల్లి సూరిబాబు, వడ్డి శ్రీనివాసరావు, వడ్డి గోవింద్, సూరు శ్రీనివాసరావు, వడ్డి నాగభూషణరావు, సూరు సత్యనారాయణ, బరాటం రవి, బోయిన నాగభూషణం, కొవ్వూరు గోవిందరావు, బి.శివప్రసాద్ తదితరులు ఈ దుకాణాల్లో వివిధ రకాల ప్రసాదాలు విక్రయిస్తున్నారు. వ్యాపారుల కోరిక మేరకు టెండర్లకు బదులుగా 35 శాతం వరకు అద్దెలు పెంచుతూ క్రమబద్ధీకరణ చేసేలా ఆలయ అధికారులు ఇప్పటికే అన్ని దుకాణాల నుంచి ఆ సొమ్మును వసూళ్లు చేశారు. దీంతో మరో రెండేళ్ల పాటు వ్యాపారాలు చేసుకుందామని భావించిన ఆ వ్యాపారులకు ఎదురుదెబ్బే తగిలింది. తాము ఆలయ అభివృద్ధికి అడ్డం కాదని..అవసరమైతే సహకరిస్తామని సదరు వ్యాపారులు స్పష్టం చేసినా ఇంత త్వరగా కూల్చివేస్తారని భావించలేదని బాధితులు వాపోతున్నారు. రథసప్తమి తర్వాత కూల్చివేస్తారని అనుకున్నా.. సంక్రాంతికి ముందే రోడ్డున పడేశారంటూ విలపిస్తున్నారు. కనీసం అభివృద్ధి పనుల తర్వాతైనా ప్రత్యామ్నాయంగా వ్యాపారాలు చేసుకునేలా దారి చూపించాలని వారంతా ప్రభుత్వ పెద్దలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

పండుగ వరకు ఆగమన్నా..



పునరావాసం కింద 24 ఏళ్లుగా ఇదే షాపుల్లో ఉన్నాం. చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నాం. షాపులు కొట్టేస్తామని చెప్తే పండుగ వరకైనా ఆగండని బతిమాలుకున్నా. అయినా వినలేదు. ఉన్నట్టుండి ఖాళీ చేయించారు. కుటుంబమంతా వీధినపడ్డాం. కొత్త దుకాణాలు కట్టి ఇవ్వాలి.

– వడ్డి శ్రీనివాసరావు, బాధితుడు

పేదలను రోడ్డున పడేయడం అన్యాయం



బాధితులతో మాట్లాడుతున్న తమ్మినేని సీతారాం

- తక్షణమే పునరావాసాన్ని కల్పించాలి
- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం డిమాండ్

ఆమదాలవలస : పండగ పూట 23 పేద కుటుంబాలను నిరాశ్రయులను చేయడం దారుణమని రాష్ట్ర మాజీ శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస మండలం చిన్న జొన్నవలసలో పేదల ఇళ్లను తొలగించిన ప్రదేశాన్ని మంగళవారం పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ సర్వే నంబర్ 108లో మోదుగుల చెరువు గట్టు ఆర్అండ్‌బీ రహదారి ఆనుకుని ఉన్న 25 సెంట్ల ప్రభుత్వం స్థలంలో తాత్కాలిక ఇళ్లు నిర్మించుకొని పేద కుటుంబాలు గత 40 ఏళ్లుగా జీవనం సాగిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ స్థలం కావచ్చును కానీ నాలుగు దశాబ్దాలుగా అక్కడే జీవనం సాగిస్తున్న విషయాన్ని మర్చిపోకూడదన్నారు. రాజకీయ కక్షలతో ఫిర్యాదుదారులు హైకోర్టును ఆశ్రయించారన్నారు. ఇళ్ల తొలగించమని తీర్పు వచ్చినా ప్రభుత్వ అధికారులు వారికి ప్రత్యామ్నాయం చూపించకుండా తొలగించడం దారుణమన్నారు. ఎంతో కాలంగా జీవిస్తున్న ఆ 23 కుటుంబాలను రోడ్డున పడేయడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మానవతా దృక్పథంతో తక్షణమే పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, పార్టీ సీనియర్ నాయకులు కోట గోవిందరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ మానుకొండ వెంకటరమణ, పార్టీ నాయకులు కూటికుప్పల సన్యాసిరావు, మొండేటి కూర్మారావు, దన్నాన సత్యనారాయణ, బొడ్డేపల్లి నిరంజన్, ఇప్పిలి శ్రీను, గొంటి కృష్ణ, నాయకులు రెడ్డి నరసింహారావు, దోగాన చిరంజీవి, అంబల్ల గోవింద, పొగిరి లక్ష్మణరావు, గొంటి అప్పినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు



అభ్యర్థుల ఛాతీ కొలత తీస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా ఎచ్చెర్ల ఆర్మ్‌డు రిజర్వు మైదానంలో కానిస్టేబుల్ అభ్యర్థుల దేహధారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. గత నెల 30న ప్రారంభమైన పరీక్షలు ఈ నెల 18 వరకు సెలవు రోజుల్లో మినహా జరుగుతున్నాయి. మంగళవారం జరి గిన ఎంపికలకు 600 మందికి గాను 364 మంది హాజరయ్యారు. తుది రాత పరీక్షకు 232 మంది అర్హ త సాధించారు. ఎత్తు, ఛాతీ కొలత, 1600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ ఈవెంట్లు నిర్వహించారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, పోలీసు అధికారులు ఎంపిక ప్రక్రియ పర్యవేక్షించారు.

నేటి ఎంపికలు వాయిదా

శ్రీకాకుళం క్రైమ్ : ఈ నెల 8న జరగాల్సిన పోలీస్ కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు వైకుంఠ ఏకాదశి, ఇతర శాంతిభద్రతల దృష్ట్యా 11వ తేదీకి వాయిదా వేసినట్లు ఎస్పీ మహేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన తేదీల్లో పరీక్షలు యథావిధిగా జరుగుతాయని పేర్కొన్నారు. అభ్యర్థులు గమనించాలని కోరారు.

రేషన్ బియ్యం సీజ్



సీజ్ చేసిన ఆటో వద్ద విజిలెన్స్, రెవెన్యూ అధికారులు

కంచిలి: మండలంలోని అరవ సరియాపల్లి నుంచి రవాణా అవుతున్న రేషన్ బియ్యాన్ని జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం దాడిచేసి పట్టుకొన్నారు. గ్రామం నుంచి ఆటోలో 19 బ్యాగుల్లో 8.20 క్వింటాళ్ల బియ్యాన్ని నారాయణబట్టికి చెందిన బుడ్డెపు అప్పన్న రవాణా చేస్తుండగా అడ్డుకొని స్వాధీనం చేసుకొన్నారు. బియ్యం, ఆటోను సీజ్ చేసి పౌరసరఫరాల డీటీ పి.కూర్మారావు అప్పగించారు. దీనిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు డీటీ తెలిపారు. సీజ్ చేసిన బియ్యాన్ని ఎం.ఎల్.ఎస్.కేంద్రానికి అప్పగించినట్లు చెప్పారు. ఈ దాడిలో విజిలెన్స్ అధికారులు ఎస్ఐ సతీష్‌కుమార్, కానిస్టేబుల్ శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పారా అథ్లెటిక్స్ పోటీలు



ఎంపికైన పారా అథ్లెట్స్‌తో అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లాస్థాయి పారా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో స్టీఫెన్ హాకింగ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సహకారంతో ఈ ఎంపికలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ ప్రారంభించారు. రన్నింగ్, జంప్స్, త్రోస్ అథ్లెటిక్స్ ఈవెంట్స్‌లో జరిగిన ఈ పోటీల్లో 60 మంది పారా క్రీడాకారులు పాల్గొనగా ఉన్నత ప్రతిభ కనబరచిన 31 మందిని రాష్ట్రపోటీలకు ఎంపికచేశారు. ఈ నెల 30న గుంటూరులో జరిగే రాష్ట్ర పోటీల్లో వీరంతా ప్రాతినిధ్యం వహిస్తారని డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, స్టీఫెన్ హాకింగ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం అధ్యక్షుడు టి.రాము, ఎన్.గిరిధర్, కార్యదర్శి డి.అచ్యుతరావు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.స్రవంతి, ఖేలో ఇండియా కోచ్ శ్రీనివాస్, ఎన్.రాజేష్ ట్రాఫిక్ జామ్ శ్రీనివాస్, లయన్స్ క్లబ్ అరసవల్లి సెక్రటరీ మణిశర్మ, సాయిబాబా, చింతు, గణపతి తదితరులు పాల్గొన్నారు

గంజాయి నిందితుడికి రిమాండ్

శ్రీకాకుళం క్రైమ్ :

గతేడాది సెప్టెంబరు 8న ఆపరేషన్ గంజాయి పేరుతో ఒకటో పట్టణ పోలీసులు ఏడుగురు జిల్లావాసులను, ఇద్దరు ఒడిశాకు చెందిన నిందితులను రిమాండ్‌కు పంపి 22 కిలోలకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. వీరితో పాటు కేసుతో సంబంధం ఉన్న మరో ముగ్గురు అప్పుడే పరారయ్యారు. వీరిలో నగరానికి చెందిన జలగడుగుల తారా వికాస్ అలియాస్ వికాస్ మంగళవారం వచ్చాడని సమాచారం తెలుసుకున్న ఒకటో పట్టణ పోలీసులు గాలించారు. ఎస్ఐ హరికృష్ణ తమ సిబ్బందితో కలసి వికాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఒడిశా వ్యాపారి సీనా నుంచి అదే రాష్ట్రానికి చెందిన హరీష్ గుంత, బంక జోసెఫ్‌లు రూ. 3 వేలకు కిలో గంజాయిని కొని జిల్లాకేంద్రానికి తెచ్చి వికాస్‌తో పాటు మరి కొందరికి రూ.5 వేలకు అమ్మేవారు. వికాస్ తదితరులు 30 గ్రాముల గంజాయి ప్యాకెట్టును రూ.400కు (కిలో రూ.13,300) నగరంలో అమ్ముకుని డబ్బులు చేసుకునే వారు. వికాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ఎం.హరికృష్ణ మంగళవారం వెల్లడించారు.

మహిళ ఆత్మహత్య



కోనాడ బోడెమ్మ (ఫైల్)

గార: అనారోగ్య కారణాలతో ఇబ్బంది పడుతూ ఆర్థికంగా భారమవుతున్నానన్న ఆలోచనతో సూపర్‌వ్యాస్మాల్ పేనుమందు తాగి వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బందరువానిపేట గ్రామానికి చెందిన కోనాడ బోడెమ్మ (54) గుండె, కిడ్నీ వ్యాధితో బాధ పడుతోంది. మంగళవారం ఉదయం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో సూపర్ వ్యాస్మాల్ తాగింది. కుటుంబ సభ్యులు గమనించి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కుమారుడు సందెయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ మూకాళ్ల చిరంజీవిరావు తెలిపారు.

ఆటో బోల్తాపడి ముగ్గురు విద్యార్థులకు గాయాలు

జి.సిగడాం: మండలంలోని పాలఖండ్యాం వద్ద మంగళవారం ఆటో బోల్తాపడి ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజాం నుంచి పొందూరు వైపు వెళ్తున్న ఆరుగురు విద్యార్థులు ఎక్కారు. పాలఖ్యండాం వద్దకు వచ్చేసరికి ఆటో బోల్తా పడటంతో అందులో ఉన్న పేకల లిఖిత, అంబల్ల అశ్విని, బొంతల జయలక్ష్మికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్సులో రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు.

13న ఉత్తరాంధ్ర ఓపెన్ క్విజ్ పోటీలు

కవిటి: మండలంలోని ఆర్.భైరిపురంలో ఈ నెల 13న ఉత్తరాంధ్ర స్థాయి ఓపెన్‌క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు భైరిపురం కల్చరల్ క్లబ్(బీసీసీ) ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైస్ సంస్థ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న ఈ పోటీల్లో విజేతలకు వరుసగా రూ.9000, రూ.7000, రూ.5000 నగదు బహుమతులు, షీల్డ్‌లు అందిస్తామని తెలిపారు. ప్రవేశ రుసుము లేదని, ఉచిత భోజన సదుపాయం కల్పిస్తామని, పూర్తి వివరాలకు 9494165120, 9493652151 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పరామర్శకు తోడు వెళ్లి.. అనంతలోకాలకు..

- గాజువాకలో లారీ ఢీకొని కెమిస్ట్ మృతి
- మృతుడు శ్రీకాకుళం జిల్లా వాసి



ప్రమాదంలో మృతి చెందిన కుసుబెల్లి రమేష్



గాయాలతో బయటపడిన కురిటి శ్రీనివాసరావు

అక్కిరెడ్డిపాలెం: రాత్రి విధులు ముగించుకుని ఆస్పత్రిలో ఉన్న తమ బంధువును పరామర్శించడానికి ఒకరికి తోడు వెళ్లిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై మరణించాడు. గాజువాక ట్రాఫిక్ ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాలివీ.. శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం నారాయణపురం నాగావళి వీధికి చెందిన కుసుబెల్లి రమేష్(30) అరబిందోలోని ఏపిటోరియా ఫార్మా కంపెనీలో కెమిస్ట్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. గాజువాకలో తన తమ్ముడితో కలిసి నివాసం ఉంటున్నాడు. అదే కంపెనీలో 68వ వార్డు అక్కిరెడ్డిపాలేనికి చెందిన కురిటి శ్రీనివాసరావు ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు. శ్రీనివాసరావు తన స్కూటీని పాత గాజువాకలో పార్కింగ్ చేస్తాడు. అక్కడ కంపెనీ బస్సు దిగి అక్కిరెడ్డిపాలేనికి స్కూటీపై వస్తుంటాడు. సోమవారం నైట్ డ్యూటీ చేసి మంగళవారం ఉదయం కంపెనీ బస్సులో వీరిద్దరూ పాత గాజువాక వద్ద దిగారు. శ్రీనివాసరావుకు చెందిన బంధువు గాజువాకలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో ఆయన్ని చూడటానికి ఇద్దరూ బయలుదేరారు. శ్రీనివాసరావు స్కూటీ నడుపుతుండగా రమేష్ వెనుక కూర్చున్నాడు. వారు ఆస్పత్రికి సమీపిస్తుండగా వెనుకనే వస్తున్న ఓ లారీ వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో స్కూటీ వెనుక కూర్చున్న రమేష్ కాళ్లు, నడుముకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మరణించాడు. శ్రీనివాసరావు తూలి పక్కకు పడిపోవడంతో భుజంపై గాయమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రమేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. గాయాలపాలైన శ్రీనివాసరావుకు గాజువాకలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లారీని స్టేషన్‌కు తరలించారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.